జాబ్‌కార్డుకు ఆధార్ లింక్

- జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న ప్రక్రియ
- పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట
- ఇప్పటికే 1,47,683 జాబ్‌కార్డుల అనుసంధానం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు


లక్ష్మణచాందలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: ఉపాధిహామీ పనుల్లో మరింత పారదర్శకతను పెంచేందుకు అధికారులు ఇప్పటికే కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ప్రతి కూలీ హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు శ్రీకారం చుట్టారు. గతేడాది వరకు కొన్ని గ్రామాల్లో కొందరు కూలీలు ఉపాధి పనులకు రాకున్నా.. వేతనం తీసుకున్నట్లు అధికారులు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. వీటిని అరికట్టి కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసి.. వారి బ్యాంకు ఖాతాల్లోనే వేతనం జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కూలీలను కలిసి వారి ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ(జాబ్ కార్డులతో ఆధార్ లింక్) పూర్తయితే పనికి వచ్చిన కూలీల హాజరును మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారి వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

59శాతం పూర్తి..

జిల్లాలోని 18 మండలాల పరిధిలో మొత్తం 2,47,546 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈనెల 20వరకు 1,47,683 జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేశామని.. మరో 99,863 జాబ్‌కార్డులు లింక్ చేయాల్సి ఉందని డీఆర్డీవో అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఇప్పటికే 59 శాతం ప్రక్రియ పూర్తయిందని.. క్షేత్రస్థాయిలో సిబ్బంది కూలీలకు అవగాహన కల్పిస్తూ ప్రక్రియ పూర్తయ్యేలా చొరవ తీసుకుంటున్నారని అన్నారు.

ఈ నెల 25 వరకు..

జిల్లావ్యాప్తంగా ఆధార్‌తో జాబ్‌కార్డులను అనుసంధానం చేసే ప్రక్రియ ఈనెల 25 వరకు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం నిత్యం మండలాల వారీగా సమాచారం సేకరించి పని పూర్తి చేయాలని సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు.

జిల్లా సమాచారం......

మండలం	జాబ్‌కార్డులు	చేసినవి	చేయాల్సినవి
కుభీర్	24,040	8,972	15068
లోకేశ్వరం	16,804	8,590	8,214
భైంసా	19,493	11,759	7,734
ఖానాపూర్	15,138	7,610	7,528
తానూరు	20,296	13,418	6,878
సారంగాపూర్	19,543	13,140	6,403
కడెం	16,821	10,692	6,129
లక్ష్మణచాంద	12,476	6,840	5,636
ముథోల్	12,833	7,323	5,510
మామడ	14,387	9,369	5,018
సోన్	9,164	4,898	4,266
పెంబి	7,442	3,874	3,568
కుంటాల	13,304	9,846	3,458
నర్సాపూర్(జి)	10,479	7,079	3,400
బాసర	6,845	3,533	3,312
దిలావర్‌పూర్	10,164	7,359	2,805
దస్తురాబాద్	7261	4,525	2,736
నిర్మల్	11,056	8,856	2,200

అనుసంధానంతో ప్రయోజనాలివే..

- ఆధార్‌తో జాబ్‌కార్డు లింక్ చేసిన కూలీలకు మాత్రమే వేతనం అదుతుంది.
- ఒత్తిడి చేసినా పనులకు రాకున్నా వచ్చినట్లు చేయడం కుదరదు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది, ఇతర కూలీలు స్వేచ్ఛగా పని చేస్తారు.
- ప్రతీ అవసరానికి బ్యాంకుకు వెళ్లే ఓపిక లేక కూలీలు అనవసర ఖర్చులు వాయిదా వేస్తారని.. దీంతో వారిలో పొదుపు అలవడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.
- ఆధార్‌తో జాబ్‌కార్డును లింక్ చేయకుంటే కొద్దిరోజులకు సదరు జాబ్‌కార్డు డీయాక్టివేట్ అయ్యే అవకాశం ఉంది.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

త్వరగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ సూచనల మేరకు జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఇప్పటివరకు 59 శాతం పూర్తయింది. మిగతాది కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. ఈనెల 25 వరకు ప్రక్రియ పూర్తి చేయాలని అన్ని మండలాల్లోని ఏపీవోలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.
– ఓస ప్రసాద్, అదనపు డీఆర్డీవో

క్లుప్తంగా

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా భోజన్న


భోజన్నను సన్మానిస్తున్న నాయకులు

లోకేశ్వరం: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దడిగే భోజన్నను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా భోజన్నను లోకేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గంగాధర్, బీజేపీ జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, నవీన్‌రెడ్డి, లోలం రవి, ముత్యం పాల్గొన్నారు.

'ఏసీడీ బిల్లు రద్దు చేయాలి'

కడెం: విద్యుత్ ఏసీడీ(అడిషనల్ కన్‌జంప్షన్ డిపాజిట్) బిల్లును రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సునారికారి రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ, డెవలప్‌మెంట్, యూజర్ చార్జీల పేరుతో అడ్డగోలు కరెంట్ బిల్లులు వసూలు చేస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. బిల్లు రద్దు చేయకుంటే విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు దుర్గం లింగన్న ఉన్నారు.

నాగోబా జాతరకు ఆదివాసీలు


జాతరకు వెళ్తున్న ఆదివాసీలు

దస్తురాబాద్: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో జరిగే జాతర మహోత్సవానికి శనివారం మండలంలోని గొడిసేర్యాల గోండుగూడ, మున్యాల గోండుగూడ, రేవోజీపేట, అకొండపేట గోండుగూడ, మల్లాపూర్ గోండుగూడకు చెందిన ఆదివాసీలు ఎండ్లబండ్లల్లో తరలి వెళ్లారు. అంతకుముందు తమ గూడేల్లో పూజలు చేసి కేస్లాపూర్ వెళ్లారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

దస్తురాబాద్: ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మండలంలోని మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులకు శనివారం జీవశాస్త్రం ఉపాధ్యాయుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో వరి నాట్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులను పొలం వద్దకు తీసుకెళ్లి వరిసాగు, ఎరువుల వినియోగం, యాజమాన్య పద్ధతులు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


ఎన్నికైన సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో శనివారం తెలంగాణ స్పందన దివ్యాంగుల హక్కుల సమితి నిర్మల్ నియోజకవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ తెలిపారు. నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా గుడిద్యాల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సగ్గం ముత్యం, ప్రధాన కార్యదర్శిగా గంగారాం, సహాయ కార్యదర్శిగా జాదవ్ మీనాక్షి, ప్రచార కార్యదర్శులుగా వినోద్, సాయి కోశాధికారిగా కదం భగవాన్, సలహాదారులుగా రమేశ్‌రెడ్డి, సాయన్న, అమ్మూల్ ఖాన్, వివేక్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో గ్యాస్ వినియోగం, భద్రతపై గృహిణులకు గౌతమ్ ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వినియోగదారులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో సర్పంచ్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు. గ్యాస్ మేనేజర్ తిరుపతి పలు సూచనలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కమిటీ సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని 12వ వార్డు పరిధి సుభాశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ పొజియాబేగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్రానికి అందుతున్న సరుకుల వివరాలు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం తెలుసుకున్నారు. ఏఎన్‌ఎం పద్మ, టీచర్లు సరోజ, మమత ఉన్నారు.
ఖానాపూర్‌లోని 11వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా చిన్నం సత్యం, సునీత, హరిప్రియ, భారతి, రమ్య, సందీప్, గంగాధర్, నవ్య, రామలక్ష్మి, సునీత, విజయలక్ష్మి ఎన్నికయ్యారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న రామారావ్‌పటేల్


లోకేశ్వరం: బాగాపూర్‌లో భక్తుల పూజలు

భైంసాటౌన్: పట్టణంలోని శనీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్య కావడంతో శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసేందుకు భారీగా తరలివచ్చారు. శనిదేవుడి ప్రతిమకు, నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ ఆలయంలో పూజలు చేశారు.
కుంటాల : మండలంలోని కల్లూర్ శనీశ్వర ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. స్వామివారికి నల్లగుడ్డలు, నవధాన్యాలు, కొబ్బరికాయ, నూనె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.
కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహాలకు నవధాన్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పార్డి(కె), రాజురా, దార్‌కుభీర్, బెల్గాం, దొడర్నా, జామ్‌గాంతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల ప్రజలు తరలివచ్చారు. హనుమాన్ మందిరం సైతం భక్తులతో కిటకిటలాడింది.
లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ రాజ్యలక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో శనిదేవుడికి, నవగ్రహాలకు పూజలు చేశారు.

'అధికారులపై చర్య తీసుకోవాలి'


ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

ముథోల్: విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ముథోల్ ఏడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్ మాట్లాడుతూ ఏడీఏ ఇంద్రసేన హైదరాబాద్‌లో ఉంటూ విధులకు హాజరవడం లేదన్నారు. కేవలం వ్యవసాయశాఖ నిర్వహించే సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నారని పేర్కొన్నారు. నకిలీ ఎరువులు, పురుగుల మందులు విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలపై దృష్టి సారించి విధులకు హాజరవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తిమ్మాపురం ముత్తన్న, దేవేందర్, ప్రసాద్, మైరాజు, భోజన్న పాల్గొన్నారు.

ఇంటివద్ద విద్యార్థులు చదివేలా చూడాలి

లక్ష్మణచాంద: విద్యార్థులు నిత్యం ఇంటి వద్ద ప్రణాళికతో పాఠాలు చదివేలా చూడాలని సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పోషకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను నిత్యం పాఠశాలకు పంపించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విద్యార్థులు ఇంటి వద్ద మళ్లీ చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, హాస్టల్ సంక్షేమాధికారి సుజయ్, ప్రధానోపాధ్యాయుడు గజ్జారాం, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్వర్, ఉపసర్పంచ్ రాజేశ్వర్, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ మానిటరింగ్ బృందం పర్యటన


రాజూరాలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్: మండలంలోని రాజూరా, సుర్జాపూర్ గ్రామాల్లో నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం పర్యటించింది. గ్రామీణాభివృద్ధి పనులతోపాటు పథకాల అమలు తీరును పరిశీలించేందుకు గ్రామాల్లో పర్యటించినట్లు అధికారులు తెలిపారు. ఎస్‌ఆర్ ఈజీఎస్, ఐకేపీ తదితర సంస్థల ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. టీం మేనేజర్ ఐఎఎస్ డాక్టర్ గంగప్ప, డీఆర్డీవో విజయలక్ష్మితో కలిసి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పశువుల పాకలు, కల్లాలు, అడవుల్లోని కందకాలు, నర్సరీలతోపాటు సెగ్రిగేషన్ షెడ్లు, ఐకేపీ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజూరా సర్పంచ్ చిన్నం లావణ్య, ఎంపీటీసీ రాజు, ఉపసర్పంచ్ లింగన్న, సుర్జాపూర్ సర్పంచ్ చెప్యాల అనురాధ, ఎంపీడీవో మల్లేశ్, సీసీ గంగప్రసాద్, ఏపీవో శివాజీ, టీఏ ప్రశాంత్, కార్యదర్శులు అనిల్, రాణి, ఎఫ్ఏ అశోక్, ఐకేపీ ఏపీఎం సునంద, సీసీ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

సప్తాహం

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో ఆదివారం అఖండహరినామ సప్తాహం ప్రారంభం కానున్నట్లు సప్తాహం కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల వార్‌కరి భక్తులు హాజరవాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పాత అశోక్ టాకీస్ ఏరియాలో 11 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటపతి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, స్తూపం, డాక్టర్స్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాస్టర్ ప్లాన్‌పై చర్చ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మున్సిపాలిటీ కొత్త మాస్టర్ ప్లాన్‌పై బీజేపీ కార్యాలయంలో ఆదివారం చర్చ ఉంటుందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసమ్మె రాజు ఒక ప్రకటనలు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్మల్ ప్రజల సౌకర్యార్థం మాస్టర్‌ప్లాన్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ మ్యాప్ నిర్మల్ ప్రజల సౌకర్యార్థం ఇంద్రానగర్‌లోని బీజేపీ పట్టణ ఆఫీస్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ సమయంలో అయినా ప్రజలు చూసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యంతరాల స్వీకరణకు ఫిబ్రవరి 10వ తేదీ వరకు అవకాశం ఉన్నందున ప్రజలందరూ మాస్టర్ ప్లాన్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పాఠశాలలో పనులు పరిశీలన

ఖానాపూర్: మనఊరు–మన బడి ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న పనులను నాణ్యతతో పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాదన్‌కుర్తితోపాటు పట్టణంలోని తిమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. శనిగారపు శ్రావణ్, పాదం రాజేశ్వర్, నీలి రమేశ్, రవిబాబు తదితరులున్నారు.

డీఆర్డీవో పర్యటన

కుంటాల : అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. కుంటాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ తరగతులను శనివారం వారు పరిశీలించి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు.. డీఆర్డీవోను సన్మానించారు. ఎంపీపీ గజ్జారాం, సీడీపీవో నాగలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద, ఏపీఎం భోజన్న ఉన్నారు.

సన్మానం

కుభీర్: మండలంలోని హల్దా గ్రామానికి చెందిన సకిండ్ల భోజన్న అనే బీజేపీ కార్యకర్త ఇటీవల హల్దా నుంచి కరీంనగర్ వరకు పాదయాత్రగా వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కలిసి వచ్చారు. ఈ సందర్భంగా శనివారం కుభీర్‌లో బీజేపీ ధర్నాకు వచ్చిన భోజన్నను మెచ్చుకొని నాయకుడు భోస్లే మోహన్‌రావ్ పటేల్ సన్మానించారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దస్తురాబాద్: రాష్ట్రంలో అంధత్వ నివారణకే సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శనివారం మండలంలోని దేవునిగూడెం గ్రామంలో కంటివెలుగు వైద్యశిబిరం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జంతు హింస నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు. వారి వెంట జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు, ఎంపీపీ సింగరి కిషన్, జెడ్పీటీసీ సంతపురం శారద, సర్పంచ్ అంజన్న, తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రాజునాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ శంకర్, ఎంపీవో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

దస్తురాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం 40 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేఖానాయక్ కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, సర్పంచ్ రాజమణి, జెడ్పీటీసీ శారద, తహసీల్దార్ లక్ష్మీ, వైస్ ఎంపీపీ రాజునాయక్, సర్పంచ్‌లు ప్రభాకర్, శంకర్, సురేశ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్ పాల్గొన్నారు.

స్వప్న ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్లు


తొలగించిన కణితి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ లైన్‌లో ఉన్న స్వప్న మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్లు చేశారు. హాస్పిటల్ వైద్యులు నాళం శశికాంత్ వివరాలు వెల్లడించారు. కుంటాల మండలానికి చెందిన ఓ రైతు(75) కొన్నేళ్లుగా కడుపులో కణితి(రెట్రోపెరిటోనియల్ ట్యూమర్)తో బాధపడుతున్నాడు. స్వప్న ఆస్పత్రిలో నాళం శశికాంత్, గిరీశ్, శ్రావణ్‌ల వైద్యబృందం ఆయనకు ఆపరేషన్ చేసి 10కిలోల కణితిని తొలగించారు. కుభీర్ మండలానికి చెందిన ఓ వృద్ధురాలు(60)కు శస్త్రచికిత్స చేసి థైరాయిడ్ గడ్డను తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు వివరించారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలు స్వప్న మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో అందిస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నాళం శశికాంత్ వివరించారు.

గుండెపోటుతో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

- కళాశాలలో ఛాతిలో నొప్పి
- ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత


చంద్రకుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహించే అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రకుమార్(52) గుండెపోటుతో మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించే చంద్రకుమార్‌కు మధ్యాహ్నం కళాశాలలోని బాత్‌రూం వద్ద గుండెపోటు వచ్చింది. అక్కడున్న సిబ్బంది వెంటనే గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే మృతి చెందాడు. చంద్రకుమార్ నిజామాబాద్‌లో నివాసం ఉండగా రోజూ నిర్మల్‌కు వచ్చి వెళ్తుంటారు. ఇతని భార్య ఉమారాణి కూడా ఆర్మూర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. చంద్రకుమార్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం, చిన్న కుమార్తె పదోతరగతి చదువుతోంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 13 గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు శనివారం రూ.8.95 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, చవాన్ శంకర్, పిరాజీ, విజయ్, సాహెబ్రావ్, సంతోశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన బురాన్‌కు రూ.26వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈ మేరకు శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధితుడికి చెక్కు అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వెంకట్‌రెడ్డిని పరామర్శించారు. సర్పంచ్ శేఖర్‌రెడ్డి, బయామొల్ల భోజన్న, భోజారెడ్డి, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


ప్రశంసాపత్రం అందిస్తున్న డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివేకానంద సేవా సమితి వారి ఆధ్వర్యంలో 'పరీక్షపే చర్చ' కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా శనివారం పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ విద్యార్థులకు పరీక్షల పట్ల భయం పోగొట్టేందుకు 28 సూత్రాలతో ఎగ్జాం వారియర్ పుస్తకం రాశారని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేజీబీవీ, అరవింద స్కూల్, ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, సమితి అధినేత నాయుడి మురళీధర్, సూపరింటెండెంట్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు నరేందర్, సంతోశ్, సాయి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆటల పోటీలు

కుంటాల: మండలంలోని అంబకంటితండాలో శాలీబాయి స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో అంబకంటి తండా జట్టు ప్రథమ స్థానంలో నిలువగా రూ. 15వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన అంబకంటి గ్రామ జట్టుకు రూ.ఏడు వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

న్యూసాంగ్వీలో వాలీబాల్ టోర్నీ..

మామడ: యువజన వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని న్యూసాంగ్వి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీని బీజేపీ నాయకుడు కాలగిరి మల్లిఖార్జున్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రీడాస్ఫూర్తి చాటాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారిభూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ మురళీధర్, మండల అధ్యక్షుడు కొరిపెల్లి లింగారెడ్డి, లింగన్నయాదవ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వానల్‌పాడ్ ప్రభుత్వ పాఠశాలలో..

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్యారమ్, కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, వాలీబాల్, షటిల్ తదితర పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు ఈనెల26న బహుమతులు అందిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల : ఇటీవల కుంటాల ఎస్సైగా నియమితులైన సాయికిరణ్‌ను శనివారం పోలీస్‌స్టేషన్‌లో పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బక్కి భోజన్న, శివాజీ, గోపాల్‌పటేల్ పాల్గొన్నారు.